

వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్ల నియామకానికి 24న ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్ల నియామకానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'వెల్‌నెస్‌లో డాక్టర్లు లేరు' అనే శీర్షికన ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు డాక్టర్ల నియామకానికి కార్యాచరణ ప్రారంభించారు. ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లతో పాటు ఓ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టును ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు 24వ తేదీన కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

టీచర్లు హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్లొద్దు : డీఈవో

సంగారెడ్డి డీఈవో ఆదేశాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులెవరూ హెడ్‌క్వార్టర్స్‌ను వదిలి వెళ్లరాదని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తమ మండలంలోని ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయరాదని ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలకు డీఈవో ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత ఇంగ్లిష్ శిక్షణ

నర్సాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తెలిపారు. ఆసక్తిగల వారు 9951551376, 9866244277 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఎండలు మండేలా..

ఉమ్మడి జిల్లాలో 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

ఉమ్మడి మెదక్ జిల్లాలో విచిత్రమైన వాతావరణం నెలకొన్నది. ఓవైపు ఎండలు తీవ్రమవుతుండగా.. మరోవైపు అకాల వర్షాలు కురుస్తున్నాయి. పది రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల లోపే నమోదుకాగా.. సోమవారం ఒక్కసారిగా 110 గ్రామాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా టేక్మాల్‌లో అత్యధికంగా 42.2 డిగ్రీలు, సిద్దిపేట జిల్లాలో అక్కన్నపేటలో 41.9, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

110 గ్రామాల్లో 40 డిగ్రీలకు పైగా..

అత్యధికంగా మెదక్ జిల్లా టేక్మాల్‌లో 42.2 డిగ్రీలు


ఎండల తీవ్రతకు జనం బేజారు

నిర్మానుష్యంగా మారిన రహదారులు

కోహీర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో భానుడి భగభగలు మొదలయ్యాయి. సోమవారం ఏకంగా 110 గ్రామాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఎండలకు భయపడి జనాలు ఇళ్లలో నుంచి బయటికి రాలేదు. ఉదయం తొమ్మిది గంటలకే వేసవి తాపం మొదలవగా మధ్యాహ్నం మరింత తీవ్రమైంది. ప్రజలు ఇల్లు దాటి బయటకి రాకపోవడంతో



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి



కోహీర్‌లో వేసవి తాపానికి చెట్టుకిందకు చేరిన పశువులు

రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఇంట్లో ఉన్నా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఫ్యాన్లు, కూలర్లు వేసుకున్నప్పటికిని వేడి గాలులకు తట్టుకోలేకపోయారు. రేకుల షెడ్లు, డబ్బాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నవారు ఎండకు తట్టుకోలేక మూసుకున్నారు. మూగజీవాలు సైతం ఎండకు ఇబ్బందిపడ్డాయి. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు ఇలా ఉన్నాయి..

మెదక్ జిల్లాలో..

టేక్మాల్ 42.2 డిగ్రీలు, బోడగాట్ 42.2, శంకరంపేట్ (ఎ) 42.2, రాజ్‌పల్లి 42.2, మెదక్ 42.1, వడ్డీ 42.1, దామరంచ 42.1, కౌడిపల్లి 42.1 చిట్కూల్ 42.0 నార్లపల్లి 42.0 బుజరంపేట్ 42.2, సర్ధన 41.9 పొడ్చన్‌పల్లి 41.9, మిన్పూర్ 41.8 వెల్దుర్తి 41.7, శంకరంపేట్ 41.7, నాగపూర్ 41.6 నర్సాపూర్ 41.6, లింగంపల్లి 41.5, కొల్చారం 41.4, చేగుంట 41.4, పాతూరు 41.3, శివ్వంపేట 41.3, కాగజ్‌మద్దూర్ 41.1, రేగోడు 40.9 మాసాయిపేట 40.8 అల్లాదుర్గం 40.8, శివనూర్ 40.8 రామాయంపేట 40.6, కొత్తపేట్ 40.6, చిప్పల్తుర్తి 40.6, ఇస్లాంపూర్ 40.5, లక్ష్మాపూర్ 40.3 మనోహరాబాద్ 40..1, దొంగల ధర్మారం 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో...

వట్‌పల్లిలి 41.1 డిగ్రీలు, గుమ్మడిదల 41.1, కడ్పల్ 41.1, రుద్రారం 41.0, కంది 41.0, కంగ్టి 40.9, పటాన్‌చెరు 40.9, ముక్తాపూర్ 40.9, మనూరు 40.9, హత్నూర 40.9, చౌటకూర్ 40.8, గుండ్లమాచనూరు 40.8 పల్వట్ల 40.8, కిష్టారెడ్డిపేట్ 40.8, నాగల్‌గిద్ద 40.8, అల్మాయిపేట్ 40.8, లక్ష్మీసాగర్ 40.8, రామచంద్రపురం 40.8, సంగారెడ్డి 40.7, మొగుడంపల్లి 40.7, కొండాపూర్ 40.7 పుల్కల్ 40.7, అన్నాసాగర్ 40.7, మునిపల్లి 40.6, అల్లోల్ 40.6, నిజాంపేట్ 40.5, సదాశివపేట 40.5, కంకోల్ 40.5, కల్హేర్ 40.5, న్యాల్‌కల్ 40.4, పాశమైలారం 40.4, సుల్తాన్‌పూర్ 40.4, కోహీర్ 40.4, నారాయణఖేడ్ 40.4, రాయికోడ్ 40.3, జిన్నారం 40.3, జహీరాబాద్ 40.2, సిర్గాపూర్ 40.2, దిగ్వాల్ 40.2, సత్వార్ 40.2, ఝరాసంఘం 40 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో...

గండిపల్లిలో 41.9 డిగ్రీలు, పోతిరెడ్డిపేట్ 41.7, పెద్దకోడూరు 41.7, చికోడు 41.6 రేబర్తి 41.5, అబ్బిపూర్ 41.5 నారాయణరావుపేట్ 41.4, హస్నాబాద్ 41.4 తుక్కాపూర్ 41.3, అంగడికిష్టాపూర్ 41.3, రాంపూర్ 41.2, తిప్పారం 41.2, కట్కూరు 41.2 చిట్యాల 41.2, బేగంపేట్ 41.1, శనిగారం 41.1 బెజ్జంకి 41.1 కోహెడ 41.1 సిద్దిపేట 41.0 సముద్రాల 41. 0, రాఘవపూర్ 41.0, గజ్వేల్ 41.0 దౌల్తాబాద్ 40.9 ముత్యాల 40.7 వెంకటరావుపేట్ 40.7, బెజుగావ్ 40.6, దూల్మిట్ట 40.6 కొమురవెల్లి 40.5, నంగనూరు 40.5, మిరుదొడ్డి 40.4, లకుడారం 401, మునిగడప 40.1 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముందు జాగ్రత్తతోనే అగ్నిప్రమాదాల చెక్

వేసవిలో మరింత అప్రమత్తత అవసరం

సంగారెడ్డి జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బి.నాగేశ్వర్‌రావు

ఫేస్ టు ఫేస్



బి.నాగేశ్వర్‌రావు, సంగారెడ్డి డీఎఫ్‌వో

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముందు జాగ్రత్తతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని సంగారెడ్డి జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి(డీఎఫ్‌వో) బి.నాగేశ్వర్‌రావు తెలిపారు. వేసవిలో జరిగే అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

వేసవిలో అగ్నిప్రమాదాలకు కారణాలేమిటి?

గ్రామాల్లో వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో, దగ్ధమవుతూ వచ్చి శివారులోని గడ్డివాములకు, ఇళ్లకు మంటలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. సిగరేట్, బీడీలు తాగుతూ పూర్తిగా ఆర్పకుండా విసిరేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా విద్యుత్ ఓవర్‌లోడ్, దుకాణాలు, షాపింగ్ మాల్స్, బహుళ అంతస్తుల భవనాల్లో నాసిరకం విద్యుత్ ఉపకరణాలు వినియోగించడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశం ఉంటుంది. వంట గదిలో గ్యాస్ లీకేజీ, గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటాయి.

పరిశ్రమల్లో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరగడానికి గల కారణాలేమిటి?

మండే స్వభావం కలిగిన ప్రదార్థాలు లీక్ కావటం, వెల్డింగ్, ఇతరత్రా వేడిమిని పుట్టించే పనులు చేయడం, నిషేధించబడిన ప్రదేశాల్లో పొగ తాగడం, విద్యుత్ స్పార్కులు, షార్ట్‌సర్క్యూట్, ఓవర్‌లోడ్, వైరింగ్‌లో సమస్యలు తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది.

ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలేమిటి?

ఏసీ, ఇతర విద్యుత్ ఉపకరణాలలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా క్రమం తప్పకుండా పరీక్షిస్తుండాలి. ఆస్పత్రుల్లోని బేస్‌మెంట్‌లో మంచాలు, పరుపులు, ఇతర ఫర్నిచర్ లాంటి వాటిని నిల్వ చేయరాదు. అదేవిధంగా మందుల దుకాణం ఏర్పాటు చేయకూడదు. పనిచేసే అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలి. అగ్నిప్రమాదం జరిగినపుడు లిఫ్ట్ వాడరాదు. మెట్ల మారం లేదా ర్యాంప్‌లను వినియోగించాలి. ఆస్పత్రిలో వాడే వాయువులను నిల్వ చేయడంలో జాగ్రత్తలు పాటించాలి.

వంటిట్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలేమిటి?

వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లను ఉంచరాదు. గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్‌ను ఆపేయాలి. చెడిపోయిన గ్యాస్‌పైపులు, ట్యూబ్‌లను వాడొద్దు. ఐఎస్ఐ మార్కు ఉన్న పైపులనే వాడాలి. వంటింటి కింద భాగం, పైభాగంలో గాలి వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలి. చిన్నారులకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచరాదు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తోంది. అగ్నిప్రమాదం సంభవించినపుడు వెంటనే 101 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలి.

అంగన్‌వాడీల్లో ఆంగ్ల విద్య

ప్రీ ప్రైమరీ బోధనకు సిద్ధం

మెదక్ జిల్లాలో 1,076 కేంద్రాల్లో అమలుకు ఏర్పాట్లు

పిల్లల సంపూర్ణ అభివృద్ధి, మేధో వికాసమే లక్ష్యం



మెదక్ అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సర్కార్ అప్‌గ్రేడ్ చేసే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నది. పిల్లలకు కేవలం పౌష్టికాహారం అందించి ఆటలు ఆడించడమే గాకుండా చిన్నతనంలోనే వారిలో జ్ఞానం పెంపొందించేందుకు విద్యా బోధన చేయనున్నారు. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్స్‌గా నామకరణం చేయనున్నారు.

కిడ్స్ స్కూల్స్ తరహాలో..

ప్రభుత్వ నిబంధనల మేరకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. కానీ ఆ తర్వాత పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ఉంచడం లేదు. ఇందుకోసం పట్టణాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలసిన కిడ్స్, వండర్ వర్ల్డ్, కిండర్ గార్డెన్ వంటి మొదలైన పేర్లతో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు. అక్కడ ఆంగ్ల మాధ్యమం బోధన చేయడంతోపాటు పేదలు కూడా ఎక్కువ డబ్బులు ఖర్చుచేసి ఆయా స్కూల్స్‌కు పంపుతున్నారు. అదే ఒరవడిలో చదవడం, ప్రైవేట్ స్కూల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. అదే అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలు ఆటలు, పాటలు, ఆహ్లాదకరమైన వాతావరణం, కల్పించడం, పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేరేందుకు అర్హులను చేయడం అంటే.. అక్షరాలు, అంకెలు, రైమ్స్ వంటి నేర్పించడం, నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా పుస్తకాలను ముద్రించి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపనున్నారు. మూడేళ్లు, నాలుగు నుంచి ఐదేళ్ల పిల్లలకు వేరువేరుగా పుస్తకాలు రూపొందించారు. ఐసీడీఎస్ యంత్రాంగానికి నూతన విధానంలో బోధించే సిలబ్‌స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు.

జూన్ నుంచి విద్యా బోధన

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 1,076 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 369 కేంద్రాలకు పక్కా భవనాలు, అద్దెభవనాలల్లో 303 ఉండగా.. మిగిలిన 404 కేంద్రాలున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి, ఇప్పటికే విడత శిక్షణ పూర్తయ్యింది. అంగన్‌వాడీ టీచర్ల విద్యార్హతలు తదితర వివరాలను రాష్ట్ర అధికారులు సేకరించారు.

పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారులకు మేలు

మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లల్లో మెదడు శరవేగంగా అభివృద్ధి చెందే దశలో ఉంటుంది. ఈ వయసులో అవగాహనతో కూడిన విద్యను అందించాలి. ఈమేరకు అంగన్‌వాడీల్లో విద్యాబోధన చేయనున్నాం. జిల్లాలోని మొత్తం 1,076 కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాం. సులభమైన బోధన అందించేందుక కొత్త సిలబస్‌ను రూపొందించాం. గతేడాది మొదటి విడత శిక్షణ అందించాం. రెండో విడతగా కొత్త సిలబస్‌పై సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. వారు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తారు.

-హైమావతి, డీడబ్ల్యూవో





రాయికోడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

భూ భారతి రైతులకు వరం : సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

రాయికోడ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికీ దశవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశంలో మె పాల్గొని మాట్లాడారు. అర్హులైన నిరుపేదలకు, దివ్యాంగులకు మొదటి విడుతలో ఎంపిక చేస్తామన్నారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించి న్యాయం చేసేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలపైనైనా దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ ప్రతి రైతు పాస్ బుక్‌లో భూమి వివరాలతో పాటు మ్యాప్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, నాయకులు సిద్దన్నపటేల్, బస్వరాజ్‌పటేల్, యేసయ్య, కేదార్‌నాథ్, సతీష్ కులకర్ణి, బాలాజీ నర్సింలు, ప్రభాకర్‌చారి, స్థానిక నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణాలివ్వాలి

సంగారెడ్డి రూరల్: రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి షరతులు లేకుండా రుణాలివ్వాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బ్యాంకు అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పథకం ద్వారా రూ. 50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం పొందేందుకు పథకాన్ని ప్రభుత్వం రూపొందించిదన్నారు. జూన్ 2న యూనిట్లు మంజూరు చేసి ప్రొసిడింగ్స్‌ను అందజేయనున్నట్టు కలెక్టర్ వివరించారు.

అమీన్‌పూర్ పెద్దచెరువు సర్వేకు నిపుణుల కమిటీ

- ఐఐటీ హైదరాబాద్, ఎన్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియా నిపుణులతో కమిటీ
- 45 రోజుల్లో తుది సర్వే చేసి నివేదిక
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

7

వేసవిలో.. ఆటలు నేర్చుకుందాం

- క్రీడా శిబిరాల నిర్వహణకు సమాయత్తం
- మే 1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు
- గ్రామీణ ప్రాంతాల్లో పది, పట్టణ ప్రాంతాల్లో 12 శిబిరాలు
- యువజన-క్రీడల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ

7

కొత్త చట్టంతో భూధార్ కార్డులు

- భూభారతితో రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



పాపన్నపేట మండలం మల్లంపేట గ్రామంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట/ చిలప్‌చెడ్/టేక్మాల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మనిషికి ఆధార్‌కార్డులా ప్రతీ భూ కమతానికి భూధార్ కార్డులు అందజేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఇందుకోసం శాటిలైట్ మ్యాప్ ద్వారా కమతాలను గుర్తించే విధానాన్ని తీసుకొస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పాపన్నపేట మండలం మల్లంపేట, చిలప్‌చెడ్ మండల కేంద్రంతో పాటు టేక్మాల్‌లో సోమవారం జరిగిన భూ భారతి అవగాహన సమావేశల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయాచోట్ల ఏర్పాటుచేసిన సమావేశాల్లో మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడానికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందిస్తుందని తెలిపారు. సాదాబైనామ దరఖాస్తులను పరిష్కరించడానికి భూభారతి ద్వారా అవకాశం వచ్చిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రభుత్వం పటిష్టం చేస్తోందన్నారు. పాపన్నపేటలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సతీష్ మండల వ్యవసాయ అధికారి మాధురి, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. చిలప్‌చేడ్ మండలంలో కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సింధుజ, ఎంపీడీవో ఆనంద్, ఏడీఏ పద్మజ, ఏవో రాజశేఖర్, తహసీల్దార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు. టేక్మాల్‌లో ఆర్డీవో రమాదేవి, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీవో విఠల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, రైతుల పాల్గొన్నారు.

- టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేటలో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు.



ఓపెన్ పరీక్షల్లో రెండోరోజు 10 మంది డిబార్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ థియరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం ఆర్‌సీపురం, పటాన్‌చెరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా కాపీయింగ్‌కు పాల్పడిన 10 విద్యార్థులను డిబార్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఓపెన్ టెన్త్ 9, ఇంటర్మీడియట్ 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 వరకు జరిగిన ఇంటర్మీడియట్ ఆంగ్లం సబ్జెక్టు పరీక్షకు 3,762 మందికి 3,400 మంది హాజరుకాగా, 262 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన టెన్త్ ఐసీహెచ్ పరీక్షకు 50 మంది హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.




ఆస్పత్రికి వెళ్లిన యువతి అదృశ్యం

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జ్వరం వచ్చిందని రెండురోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన గుర్రం రేవతి(18) మనోహరాబాద్ మండలం రామయపల్లిలోని ఓ పరిశ్రమలో కార్మికురాలుగా పనిచేస్తుంది. పదేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతిచెందడంతో.. ఇదే గ్రామంలో పెద్దనాన్న కూతురైన బుచ్చమ్మ దగ్గర ఉంటుంది. పదిహేను రోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తుండగా ఈనెల 19న జ్వరం వచ్చిందని తూప్రాన్ ఆస్పత్రికి వెళ్లొస్తానని చెప్పింది. రెండురోజులైనా తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. మేనమామ కోదాస్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిష్టాపూర్‌లో ఒకరు..

చేగుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన మందాపురం కిష్టారెడ్డి (59) ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లాడు. 20 రోజులైనా తిరిగిరాకపోవడంతో భార్య శోభ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య


మృతిచెందిన ఆంజనేయులు

పాపన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని బాచారంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రావుగారి ఆంజనేయులు(40) కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల కిందట ఇంద్రేశంలో రేకుల ఇళ్లు నిర్మించుకున్నాడు. నిర్మాణం కోసం కొంత అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 19న గ్రామంలో బంధువుల ఫంక్షన్‌లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చాడు. అదేరోజు సాయంత్రం గ్రామ శివారులోని చేను వద్ద పురుగు మందు సేవించాడు. అటువెళ్లిన వారు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమిం సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

పటాన్‌చెరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసగా మారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన రావుగారి ఆంజనేయులు(40) కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల కిందట ఇంద్రేశంలో రేకుల ఇళ్లు నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం కొంత అప్పు అయింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 19న గ్రామంలో బంధువుల ఫంక్షన్‌లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చాడు. అదేరోజు సాయంత్రం గ్రామ శివారులోని చేను వద్ద పురుగు మందు తాగాడు. అటుగా వెళ్లిన వారు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు కూతురు, ఇద్దరు కుమారులు, ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భార్యతో గొడవపడి..

ఐడీఏబొల్లారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఐడీఏబొల్లారం పురపాలక పట్టణ పరిధి జీఎంఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కూర్మయ్య(39) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం సమయంలో భార్య ఎల్లమ్మతో కుటుంబ సమస్యలపై గొడవ పడ్డారు. దీనిపై మనస్తాపం చెందిన కూర్మయ్య చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెల్దుర్తి మండలం మానెపల్లి గ్రామానికి చెందిన చౌదరిపేట రాగిరి(50) తన కున్న పొలం వద్ద ఇటీవల బోరు వేయించగా.. ఫెయిల్ అయ్యింది. దీనికితోడు పంటకు సరిగ్గా నీరు అందక ఎండిపోయింది. చేసిన అప్పులు అధికమవడంతో 17న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి నర్సాపూర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య నర్సమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మద్దూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బొడ్రాయి పండుగరోజు విషాదం చోటు చేసుకున్నది. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని లద్నూరులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ యాదగిరి బతకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. కాగా గ్రామంలో బొడ్రాయి పండుగకు కుటుంబంతో ఇంటికి వచ్చాడు. ఇంట్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటంతో సాయంత్రం సరిచేసేందుకు వెళ్లిన యాదగిరి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే గమనించిన కొందరు 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వ్యక్తి కత్తితో కడుపులో పొడుచుకోగా.. పేగులు బయటపడ్డాయి. ఈ సంఘటన శివ్వంపేట మండలం పరిధిలోని బోజ్యాతండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన గుగులోత్ విఠల్(55) మద్యం మత్తులో కుటుంబసభ్యులతో గొడవపడి కడుపులో పొడుచుకున్నాడు. దీంతో పేగులు బయటపడ్డాడు. కుటుంబీకులు గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న కంకులు దగ్ధం

కంగ్టి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మొక్కజొన్న కంకులు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఘన్‌పూర్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన భగవాన్ సయ్యద్ నాలుగురోజుల క్రితం మొక్కజొన్న కంకులు కోసి ఎండబెట్టేందుకు పొలంలో ఉంచాడు. తిరిగి సోమవారం ఉదయం పొలానికి వెళ్లి కూడగా కంకులు కాలిపోయి ఉన్నాయని వాపోయాడు. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంట కాలిపోవడంతో సుమారు రూ.50 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని సయ్యద్ కోరారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డిమోపులు దగ్ధం

వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ గ్రామం వద్ద చోటు చేసుకుంది. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎల్లాగౌడ్ ట్రాక్టర్‌లో గడ్డి మోపులను తరలిస్తుండగా ఉప్పులింగాపూర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న 200 మోపుల గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న మెదక్ అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేశారు.

పాఠశాల హెచ్‌ఎం గైర్హాజర్

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలకు గైర్హాజరైన సంఘటన పోతులబోగుడ పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. శివ్వంపేట మండల పరిధిలోని పోతులబోగుడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మానసకుమారి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయ్యారని మాజీ స్కూల్ చైర్మన్ బాలకృష్ణ, అంజనేయులు తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు సంప్రదించగా.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలు ఏర్పాటు చేయొద్దు


కొల్చారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోకి వెళ్లే నడిరోడ్డుపై అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్ మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు. అందరూ కలిసి ఉండాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. కొల్చారంలో అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను సోమవారం పరిశీలించి, మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేశారు.















కుంట వద్ద తవ్వకాలపై జాయింట్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్ అధికారుల బృందం

మాసాయిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరి కుంట వసానికుంట పక్కనే ఏర్పాటు చేసిన వెంచర్‌లో అక్రమంగా తవ్వకాలు జరిపి, కాలువలకు అడ్డంగా మట్టి నింపడంపై సోమవారం ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించారు. మండలంలోని బొమ్మారం గ్రామ కుమ్మరికుంట, మాసాయికుంట వద్ద అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపణలు రావడంతో జాయింట్ సర్వే చేసి, వెంచర్ యాజమానికి నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో జ్ఞానజ్యోతి, ఆర్ఐ దన్‌సింగ్, సర్వేయర్ నరసింహులు, మైనింగ్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

పుల్‌కల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన గేటు వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరవధిక సమ్మెకు దిగారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం జేఎన్టీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్రంలోని 12వర్సిటీలలో 1,445 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా బోధన చేస్తున్నారని తెలిపారు. నెల రోజులుగా వివిధరూపాల్లో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తూనే సమ్మెకు దిగారు. దీంతో ఇంజనీరింగ్ కళాశాలలో తరగతుల నిర్వహణకు బ్రేక్ పడింది. యూనివర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయాలని, ప్రొఫెసర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంటలు ఎలా ఉన్నాయ్..

ఇక్రిసెట్ శాస్త్రవేత్తలతో కలిసి సౌదీ రైతుల పర్యటన



స్థానిక రైతులతో ఇక్రిసెట్ శాస్త్రవేత్తలు, సౌదీ రైతులు

కొండాపూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటల సాగు పద్ధతిని తెలుసుకునేందుకు ఇక్రిసెట్ శాస్త్రవేత్తలతో కలిసి సోమవారం సౌదీ అరేబియా రైతులు హరిదాస్‌పూర్‌లో పర్యటించారు. వరి, జొన్న పంటల సాగు పద్ధతి, పెట్టుబడి, కూలీల ఖర్చులు, దిగుబడి, మార్కెటింగ్ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. పంట సాగులో విత్తనాలు, ఎరువులు మందుల వినియోగం, అధునిక పద్ధతి, సబ్సిడీలు, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అవశాలను తెలుసుకున్నారు. వారి వెంట ఏడీఏ వెంకటలక్ష్మి, ఏవోలు గణేష్, ప్రతిభ, ఏఈవో రవి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు నర్సింహులు, కరణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మెడికల్ షాపులను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్



మెడికల్ షాప్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెడికల్ షాపులను సోమవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ పరిశీలించారు. జనూష మెడికల్ జనరల్ స్టోర్, పవన్ శృతి, శ్రీనివాస మెడికల్ స్టోర్లను ఆమె పరిశీలించారు. ఓ మెడికల్ జనరల్ స్టోర్‌లో ఫార్మసిస్ట్ లేకపోవడం, మెడికల్ షాపుల్లో సరైన రిజిస్టర్ నిర్వహణ లేకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా చంద్రకళ హెచ్చరించారు.



మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబానికి బెనిఫిట్స్ పత్రాలను అందజేస్తున్న సీపీ

కానిస్టేబుల్ కుటుంబానికి బెనిఫిట్స్

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబ సభ్యులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సోమవారం సీపీ డాక్టర్ బి. అనురాధ అందజేశారు. పోలీస్ శాఖ నుంచి వచ్చిన రూ. 16 లక్షల చెక్కులను ఆమె నవీన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ విధినిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు తమ శాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరింటెండెంట్ మహమ్మద్ ఫయాజుద్దీన్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవిరాజు, సీసీ నితిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసలే నీటి కొరత.. జీపీ ట్రాక్టర్‌తో సీసీ రోడ్డుకు నీరు



మిరుదొడ్డి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి కోసం జనం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ప్రజల అవసరాలు కాదని, సీసీ రోడ్డుకు ఏకంగా గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో నీటిని అందించారు. వివరాల్లోకి వెళ్తితే.. దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తుండగా, ఇందుకు అవసరమైన నీటిని గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా అందిస్తున్నారు. ఓ పక్క జనం నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, ఇలా ట్యాంకర్‌ను దుర్వినియోగం చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆటలు నేర్చుకుందాం



క్రీడా శిబిరాల నిర్వహణకు సమాయత్తం
మే 1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు
గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 12 శిబిరాలు
యువజన-క్రీడల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బాల్యం నాలుగు గదులకే పరిమితమై బరువెక్కుతున్నది. ఆటల్లేవ్.. ఆడుకోవడాల్లేవనే చందంగా నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్లలోని గేమ్స్‌లో మునిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏటా మే నెలలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వేసవిలోనూ క్రీడా శిబిరాల నిర్వహణకు సమాయత్తం అవుతున్నారు.

నెల రోజుల పాటు



జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు ఉదయం 6నుంచి 9గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్రీడా శిబిరాలు నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో క్యాంపు నిర్వహణకు అర్హులైన సీనియర్, జాతీయ క్రీడాకారులను, పీఈటీ, పీడీలను ఎంపిక చేశారు.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో క్రీడ

సమ్మర్ కోచింగ్ క్యాంపులు గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 12 నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో భాగంగా సిర్గాపూర్ మండలం అంతర్గామ్‌లో ఆత్యాపాత్య, సంగారెడ్డి మండలం గొల్లగూడెంలో బాక్సింగ్, పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కిక్‌బాక్సింగ్, ఉత్తర్‌పల్లిలో కబడ్డీ, అంగడిపేటలో చెస్, కంది మండలం ఎద్దుమైలారం ఓడీఎఫ్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, కంది గ్రామంలో అథ్లెటిక్స్, అందోల్ మండలం మాసన్‌పల్లిలో కబడ్డీ, పటాన్‌చెరు మండలం లక్డారంలో బాక్సింగ్, నారాయణఖేడ్ మండలం జుజుల్‌పూర్‌లో ఫుట్‌బాల్ క్యాంపులు నిర్వహించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో వచ్చేసరికి సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వుషు, బీహెచ్ఈఎల్ గ్రౌండ్‌లో హాకీ, నారాయణఖేడ్‌లో కబడ్డీ, సదాశివపేటలో ఫుట్‌బాల్, శ్రీవికాస్ హైస్కూల్‌లో కబడ్డీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుట్‌బాల్, రైఫిల్ షూటింగ్, విగ్నాన్ మోడల్ స్కూల్‌లో వుషు క్రీడా క్యాంపులు నిర్వహిస్తారు. 14 ఏళ్ల లోపు వయసున్న వారు మాత్రమే ఈ శిబిరాల్లో పాల్గొనుటకు అర్హులు. పూర్తి వివరాలకు 79817 98957 నంబరును సంప్రదించాలి.



సద్వినియోగం చేసుకోవాలి

నెల రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో ఇచ్చే శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి. సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందాలనుకునే వారు క్యాంపు ఇన్‌చార్జిలను నేరుగా వెళ్లి పేరు నమోదు చేసుకొని శిక్షణ పొందవచ్చు. వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి. తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుంది. క్రీడల్లో తమ పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

- ఎం.ఖాసీంబేగ్, డీవైఎస్‌వో, సంగారెడ్డి

'ఇందిరమ్మ'లో అనర్హులకు లబ్ధి జరగొద్దు

ఇళ్లను త్వరగా పూర్తి చేయండి
రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడితో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ గౌతమ్

సిద్దిపేట కలెక్టరేట్/సిద్దిపేట రూరల్/కుకునూరుపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హులకు లబ్ధి చేకూర్చవద్దని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. సిద్దిపేట ఐడీవోసీలో సోమవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రగతిపై కలెక్టర్ మనుచౌదరితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 5లక్షలతో ఇంటి నిర్మాణం ఏ విధంగా సాధ్యమన్న సందేహాన్ని తీర్చి, లబ్ధిదారుల్లో నమ్మకాన్ని కల్పించేలా ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. స్థలం ఉండి, ఇళ్లు కట్టుకునే స్తోమత లేని నిరుపేదలనే అర్హులుగా గుర్తించాలని, ఆర్థిక సహాయం కోరుకునే వారికి మహిళా సమాఖ్యల ద్వారా రుణం అందేలా చొరవ చూపాలని సచిఇంచారు. లబ్ధిదారుడు ఇందిరమ్మ ఇండ్లు అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు ఇంటి నిర్మాణ ప్రగతి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇలా చేస్తే బిల్లుల ఆలస్యం ఉండదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కమిటీలు గుర్తించిన లబ్ధిదారులను అధికారులు మరోసారి పరిశీలించాలన్నారు. అసంపూర్తిగా, చివరిస్థాయిలోఉన్న రెండు ఎడకగదుల నిర్మాణ పనులపై మాట్లాడుతూ, వాటిని పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు, యజమానులు ముందుకు వచ్చినట్లయితే వారితో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, హౌసింగ్ పీడీ దామోదర్ రావు, డీఆర్‌డీఏ జయదేవ్ ఆర్య, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు చంద్రకళ, రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయితీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ఎండీ వీపీ గౌతమ్ పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన సిద్దిపేట రూరల్ మండలం వెంటాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో 2667 మంది లబ్ధిదారులను గుర్తించామని, ఆయా నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, గృహనిర్మాణ సంస్థ పీడీ దామోదర్‌రావు, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీవో మురళీధర్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఉన్నారు. అలాగే, కుకునూరుపల్లి మండలంలోని మొదినీపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి, కొండపాక ఎంపీడీవోలు రాంప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వైష్ణవి



మర్కుక్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లింగ వైష్ణవి పంజాబ్ అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ వర్సిటీ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటింది. 12 దేశాలకు చెందిన అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వై. చిన్న బ్రహ్మయ్య మార్గదర్శకంలో కేవలం ఒక నిమిషం 59 సెంకండ్లలో రసాయన శాస్త్రంలోని నూతన అవర్తన పట్టిక క్రమాంకంలో ఏర్పాటు చేసి ఇంటర్నేషనల్ బుక్‌లో చోటు సంపాదించకుంది. ఆమెను మండల విద్యాధికారి వెంకటరాములు అభినందించగా, పాఠశాల తెలుగు భాష ఉపాధ్యాయిని ముదిగొండ మణిమాల విశ్వప్రసాద్ రూ.15 వేల నగదును అందజేసి అభినందించారు.

విహాన్‌రామ్ పేరూ..



ధూళిమిట్ట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో హనుమతండాకు చెందిన అంతర్జాతీయ బాల పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కింది. జాటోత్ విహాన్‌రామ్ అత్యంత ఎత్తైన కిలిమంజారో(5685 మీ) పర్వతాన్ని, హిమాచల్‌ప్రదేశ్‌లోని పాతాల్సు (4250 మీ) పర్వతాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన పేరును ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో ఎక్కించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అమృత్‌సర్‌లో జరిగిన కార్యక్రమంలో విహాన్‌రామ్ తల్లిదండ్రులతో కలిసి సర్టిఫికెట్‌ను అందుకున్నాడు.

గడువుదీరిన ట్యాబ్లెట్స్ పంపిణీపై ఆరా!

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో గడువు ముగిసిన ట్యాబ్లెట్ల పంపిణీ వ్యవహారంపై కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం ఆరా తీశారు. ఓపీ ద్వారా వచ్చిన మహిళకు గడువు తీరిన ట్యాబ్లెట్లు ఎందుకు ఇచ్చారు? కాలం చెల్లిన మందులు నిల్వ ఉంచడమేమిటన్న కారణాలు ఆరా తీశారు. గడువు ముగిసిన ట్యాబ్లెట్ల పంపిణీ ఘటనపై ఈజేహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉన్నతాధికారులు కూడా ఆరా తీశారు. మందులు ఇచ్చిన సంబంధిత సిబ్బందిపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కలెక్టర్‌కు పూర్తి నివేదిక సమర్పించనున్నట్టు సమాచారం.

తెలుగుభాషను కనుమరుగు చేయవద్దు

తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి
కలెక్టరేట్‌లో వినతిపత్రం



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న తెరవే ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేల ఏళ్ల నుంచి మాట్లాడే తెలుగును, మన మాతృభాషను కనుమరుగు చేయాలనుకోవడం అవివేకమే అవుతుందని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో సంస్కృతాన్ని ద్వితీయ భాషగా అనుమతించే నిబంధనకు నిరసనగా తెరవే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. శాతవాహనుల కాలం నుంచి తెలుగుభాష మనుగడలో వున్నదని, ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడేభాషల్లో తెలుగు 16స్థానం లోనూ, దేశంలో నాలుగో స్థానంలో ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భావజాలవ్యాప్తికి ఎంతగానో ఉపయుక్తమైందన్నారు. అంతేకాకుండా తెలుగుభాష సుసంపన్నమైన సాహిత్య సంపదను, చూడముచ్చటైన లిపి, అన్ని ధ్వనులను పలిగే వర్ణమాల తెలుగు భాష సొంతమన్నారు. ఇన్ని విశిష్టతలు ఉన్న తెలుగు భాష అస్తిత్వాన్ని ఎసరుపెట్టే అధికారుల నిర్ణయం విచారకమన్నారు. విద్యార్థికి మాతృభాషలోనే విద్య అందాలని, వైద్య ఇంజనీరింగ్ శాస్త్ర సాంకేతిక విద్యలు సైతం మాతృభాషలోనే బోధించాలని నూతన విద్యావిధానం చెబుతున్నదన్నారు. హైస్కూల్ వరకు తెలుగు ప్రథమభాషగా తెలంగాణలో అమలులో ఉందని, ఇంటర్.. డిగ్రీల్లో ఇందుకు విరుద్ధంగా తెలుగును కనుమరుగు చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు మహమూద్ పాషా, ప్రధాన కార్యదర్శి స్రవంతి మహిపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్కపెల్లి యాదగిరి, నరసింహారెడ్డి, ప్రవీణ్, మహేందర్, అశోక్ రాజు, స్వామి, ఉమాశంకర్, రాజు, గోత్రాల సంతోష్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు సర్వేకు నిపుణులతో కమిటీ

45 రోజుల్లో నివేదిక.. హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముంపు బాధితుల జేఏసీ నాయకులు

అమీన్‌పూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు సమగ్ర సర్వే చేపట్టేందుకు నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. సోమవారం చెరువు ప్లాట్ల ముంపు బాధితుల జేఏసీ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్య చెరువుగా గుర్తింపు పొందించిన అమీన్‌పూర్ పెద్దచెరువు విస్తీర్ణంపై నెలకొన్న అపోహలు తొలగించేందుకు నిపుణుల సహాయం కోరామన్నారు. చెరువు విస్తీర్ణం ఏటేటా పెరిగిపోవడంతో ఎఫ్‌టీఎల్, బఫర్ విస్తరించుకుంటూ వెళ్లడంతో ప్లాట్లు, ఇండ్లు, కాలనీలు ముంపుకు గురవుతున్నాయని గుర్తించామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో హుడా అనుమతులు ఉన్న కాలనీలలో ఇండ్ల స్థలాలు కొన్న వారి పరిస్థితిని అర్థం చేసుకున్నామని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. పాత ఇరిగేషన్, రెవెన్యూ రికార్డులు, టిప్పన్‌మ్యాప్, గ్రామ నక్షాలను క్రోడీకరించి ముంపు సమస్యకు కారణాలను తెలుసుకుంటున్నామన్నారు. అమీన్‌పూర్ పెద్దచెరువు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. చెరువును ఒక వైపు మూసివేయడం వల్ల మరో వైపు ముంపు గురవుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధులే కాకుండా శిథిలమైన తూములు, కాల్వలను పునరుద్ధరించడంపై దృష్టి పెట్టామన్నారు. అనేక చోట్ల కాల్వలు కబ్జాలకు గురైనట్లు సంబంధింత ప్రభుత్వ శాఖల నివేదికలో పేర్కొన్నట్లు చెప్పారు. చెరువు నీటి సామర్థ్యాన్ని ఏటా స్థిరీకరించేందుకు తూములను వదలాలన్న డిమాండ్ నెలకొందన్నారు. వరద నీటితో పాటు నిత్యం కలిసే డ్రైనేజీ నీటితో నీటి మట్టం పెరుగుతున్న సమస్యకు పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. సాంకేతికంగా చెరువు విస్తీర్ణం నిర్ణయించేందుకు ఐఐటీ హైదరాబాద్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ), సర్వే ఆఫ్ ఇండియా నిపుణుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సమగ్ర సర్వే చేస్తుందని వివరించారు. 45 రోజుల్లో సర్వే పూర్తి చేసి, నివేదికను సమర్పించిన తరువాత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ చెప్పారు. నిపుణుల కమిటీకి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తారన్నారు. సర్వే అనంతరం పెద్ద చెరువు ముంపు బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జీవవైవిధ్య చెరువును కాపాడటంతోపాటు నిజమైన బాధితులకు న్యాయం చేయడమే తమ ఉద్దేశమని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్‌తో సమావేశమైన వారిలో జేఏసీ ఛైర్మెన్ చిరునామా సత్యనారాయణ, సభ్యులు సంజయ్‌కుమార్, టీవీ.రావు, జీవ, నాగభూషన్‌రావు, సత్యనారాయణ, రామకృష్ణ, రంగరాజు, రవీందర్, కృష్ణకుమార్, కాసులపెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

70 వేల నాణెలతో తిరుపతి వెంకన్నకు మొక్కు

కూచనపల్లి నుంచి బయలుదేరిన భక్తుడు

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓ భక్తులు 70 వేల నాణెలతో తిరుపతి వెంకన్నకు మొక్కు చెల్లించుకునేందుకు బయలుదేరాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామానికి చెందిన పైడిద్ద రాజు తన భార్య ఆరోగ్యం నయం కావాలని 2019లో వేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నాడు. కరోనా సమయంలో రక్తకణాలు తగ్గి ఆస్పత్రిలో ఉండగా ఆమెకు నయం అయితే, ఆమె ఎత్తు నాణెలు సమర్పిస్తానని మొక్కుకున్నాడు. అప్పట్లోనే అతని భార్య బరువును తూకం వేయగా, 93 కిలోలు వచ్చింది. భార్య ఆరోగ్యం కుదుట పడటంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదేళ్ల పాటు పైడిద్ద రాజు వివిధ నాణెలను పోగు చేశాడు. అవి మొత్తం 70 వేల నాణెలు అయ్యాయి. వాటి లెక్క సరిచూసుకున్న పైడిద్ద రాజు సోమవారం తిరుపతి వేంకటేశ్వరునికి మొక్కు చెల్లించుకునేందుకు భార్యాపిల్లలతో కలిసి తిరుపతి బయలుదేరాడు. 70 వేల నాణెలను మూటలుగా కట్టి వాటిని తీసుకుని వెళ్తున్నారు. నాడు తాను మొక్కుకున్న తర్వాత అంతా మంచే జరిగిందని, అందుకోసమే స్వామివారికి మొక్కుకున్న విధంగా నాణెలతో మొక్కు చెల్లించుకునేందుకు వెళ్తున్నానని ఈ సందర్భంగా రాజు తెలిపారు.



పైడిద్దరాజు పోగు చేసిన నాణెలు

న్యూస్ బాక్స్

జీపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాలరాజ్

పుల్‌కల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. సోమవారం మండల కేంద్రం చౌటకూర్‌లోని రైతువేదిక వద్ద జరిగిన సమావేశంలో 15 మందితో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలరాజ్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, సుందరయ్య, కె.జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా దుర్గారావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా రాములు ఎన్నికయ్యారు. వీరితో పాటుగా సహాయ కార్యదర్శులుగా పవన్, పెంటయ్య, కోశాధికారిగా సత్తయ్య, కమిటీ సభ్యులుగా చంద్రయ్య, మహేందర్, శంకరయ్య, లాజర్‌లు ఎన్నికయ్యారు.

పోషకాహారంతో వ్యాధులు దూరం

కల్హేర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : పోషకాహారంతోనే వ్యాధులు దూరమవుతాయని నారాయణఖేడ్ ఐసీడీఎస్ సీడీపీవో సుజాత, తహసీల్దార్ శివ శ్రీనివాస్ పేర్కొన్నారు. పోషణ్ పక్షంలో భాగంగా కల్హేర్‌లో సోమవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం సాయిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహకారం చేస్తోందని కాంగ్రెస్‌ని యోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 9 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.



హవేళిఘణపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



కౌడిపల్లి: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



తూప్రాన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలకృష్ణారెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

తూప్రాన్/కౌడిపల్లి/చిలప్‌చెడ్/రేగోడు/మనోహరాబాద్/శివ్వంపేట/వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని శాలిపేట, హవేళిఘణపూర్, బోగుడ భూపతిపూర్, జక్కన్నపేట, ఫరీద్‌పూర్ గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మిమోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. అలాగే ముత్రాజ్‌పల్లి నుంచి కిస్టారెడ్డితండాకు 1.9 కిలోమీటర్లకు రూ.1.70 కోట్లు, ముత్రాజ్‌పల్లి నుంచి తాళ్లగడ్డతండాకు 2.3 కిలోమీటర్లకు రూ.1.8 కోట్లు, 4.3 కిలోమీటర్లకుగానూ రూ.3.5 కోట్ల బీటీరోడ్ల పనులను ప్రారంభించారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిలప్‌చెడ్, చండూరు, చిట్కుల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. తూప్రాన్ పట్టణం, మండలంలోని నాగులపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి సర్పంచుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్‌రెడ్డి, నేత మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొక్కొండ దీపక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రేగోడు మండలంలోని రేగోడు, చౌదరిపల్లి, కొత్వాల్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ దత్తారెడ్డి నాయకులతో కలిసి ప్రారంభించారు. మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి ప్రారంభించారు. శివ్వంపేట మండలం అల్లీపూర్, పిల్లుట్ల, లింగోజిగూడ, రత్నాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. వెల్దుర్తి మండల పరిధిలోని యశ్వంతరావుపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈవో సిద్ధయ్య ప్రారంభించారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తే ఊర్కోం

రామాయంపేట/మెదక్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌పై ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తే ఊరుకోమని టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు హెచ్చరించారు. సోమవారం రామాయంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు తమపై ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, నాగరాజు, దేమే యాదగిరి, అల్లాడి వెంకటి, చింతల స్వామి ఉన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధుసూదన్‌రావు బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

సంస్కృతీ సంప్రదాయాలను పాటించాలి: భారతీమహాస్వామి



పెద్దశంకరంపేటలో భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న భారతీమహాస్వామి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిఒక్కరూ పాటించాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీమహాస్వామి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో సీతారామచంద్రస్వామి పునః ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మాన్ని ప్రస్తుతం ప్రపంచం మొత్తం పాటిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం/రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ పురపాలక పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు జంక్షన్, వెలిమెల నుంచి వెలిమెలతండా, పాటి గ్రామ పరిధిలో రూ.4.58 కోట్లతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనులకు ఇటీవల మున్సిపల్ పాలక వర్గం ప్రతిపాదించిన పనులకు ఆర్థికశాఖ ద్వారా అనుమతులు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ సర్పంచులు సోమిరెడ్డి, లక్ష్మణ్, స్వామి గౌడ్, రాములు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, హెచ్ఎండీఏ డీఈ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు శంషాద్ రాజు, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

‘భూభారతి’ సదస్సులను విజయవంతం చేయండి

కల్హేర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూభారతి అవగాహనా సదస్సులను రైతులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. కల్హేర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భూభారతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. భూభారతిపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడానికి 22న ఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి, కల్హేర్, నిజాంపేటతో పాటు మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేటలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్‌రాజ్, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈవోలు సంతోషకుమారి, క్రిష్ణవేణి, ఆర్ఐ మల్లేశం, మండలాధ్యక్షుడు పోచయ్య పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు 35, పౌరసరఫరాల శాఖకు రెండు, సర్వే అండ్ ల్యాండ్ 4, పంచాయతీ, పీటీ విభాగానికి 3, పంచాయతీరాజ్ 2, డీఆర్డీవో, మున్సిపల్‌కు 3, వెల్ఫేర్ శాఖకు 3, వ్యవసాయ శాఖకు 4, పశు సంవర్థక శాఖకు3 మొత్తం 63 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, ఏవో అంటోని, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. ప్రజావాణికి మొత్తం 64 అర్జీలు అందాయి.

ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడారు.

బాల్యం నుంచే రచనలు చేయాలి

● డీఈవో రాధాకిషన్

హవేళిఘణపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాల్యం నుంచే రచనలు చేయడం నేర్చుకోవాలని మెదక్ డీఈవో రాధాకిషన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రచించిన ‘అమృత గుళికలు’ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు నీతి, న్యాయం, ధర్మంతో కూడిన రచనలు చేస్తే అవి చరిత్రలో నిలిచిపోతాయన్నారు. అనంతరం పుస్తక సంపాదకుడు రాజేశంను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండల కేంద్రంలో స్థానిక దత్తాత్రేయ మందిరంలో వారంరోజుల పాటు జరుగుతున్న భీందాస్‌మహరాజ్ శతాబ్ది ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, జడ్పీ ప్రణాళిక మండలి మజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి పైదాడి

హవేళిఘణపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకుడిపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం పోలీస్ స్టేషన్‌లో బీఆరెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మండలంలోని స్కూల్ తండాకు చెందిన రంజిత్ నాయక్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి బెదిరింపులకు గురి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై సత్యనారాయణకు ఫిర్యాదు చేసింది.

విమర్శలు మానుకోవాలి

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. శివ్వంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, వెంకట్రాంరెడ్డి మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తాపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

అఖండ హరినామ సప్తాహ ప్రారంభం

నారాయణఖేడ్ : ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని భూమయ్య కాలనీలోని శివ పంచాయతన అభయాంజనేయస్వామి ఆలయంలో అఖండ హరినామ సప్తాహ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. దెగుల్‌వాడికి చెందిన వెంకట్‌రావు దేశాయ్‌మహరాజ్, కమలాపూర్‌కు చెందిన వామన్‌రావుమహరాజ్ ప్రవచనాలు వినిపించారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం



దండుపల్లిలో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్/మునిపల్లి/వెల్దుర్తి/గుమ్మడిదల/ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలోని శుభం గార్డెన్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొండాపూర్, మనోహరాబాద్, రంగాయపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ పురం నవనీత రవి, రాష్ట్ర నాయకులు శేఖర్‌గౌడ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో చలో వరంగల్ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే సునీతారెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. మునిపల్లి మండల పరిధిలోని పోల్కంపల్లి- ఖమ్మంపల్లి గ్రామ శివారులో గల శ్రీ సాయిగార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గుమ్మడిదల మండలంలోని చంద్రారెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కోలన్ బాల్‌రెడ్డి, జిన్నారం వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.

వొకేషనల్ కోర్సుల్లో ‘స్ఫూర్తి’ కళాశాల సత్తా



సంగారెడ్డిలో విజయసంకేతం చూపుతున్న స్ఫూర్తి వొకేషనల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని స్ఫూర్తి బి.వొకేషనల్ డిగ్రీ కళాశాలకు చెందిన ఫస్టియర్ విద్యార్థులు పారామెడికల్ కోర్సు ఫలితాల్లో సత్తాచాటారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన పరీక్షలకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. అయితే కళాశాల ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బి.ధారాసింగ్, డా.రాజు గౌడ్, ప్రిన్సిపాల్ సుమ సమక్షంలో మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ గీతాంజలి, అధ్యాపకులు స్వాతి, సరళ, మాధవీలత, శివలీల, వినోద, ప్రవీణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బిలాల్‌పూర్‌లో ముందస్తు బడిబాట



బిలాల్‌పూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

కోహీర్/మనూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో ప్రచారం చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల కోసం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈవో జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులకు తమ పిల్లలను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. మనూరు మండలంలో ఎంఈవో శేఖర్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు.

ఆడపిల్లలను రక్షణ అందరి బాధ్యత

● సీడీపీవో స్వరూపారాణి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రామాయంపేట సీడీపీవో స్వరూపారాణి అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆశాలకు, ఏఎన్ఎంలకు ఆడపిల్లల రక్షణ, ఎదుగుదల, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల చిన్న చూపు తగదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, హెల్త్ ఆఫీసర్ యాదగిరిరావు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



నర్సాపూర్‌లో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై, నర్సాపూర్ పట్టణ పరిధిలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలను మున్సిపల్ సిబ్బంది సోమవారం తొలగించారు. నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ మూడురోజుల క్రితం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల వల్ల పాదచారులకు ఇబ్బంది కలుగడమే కాకుండా వాహనదారులకు అసౌకర్యంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో సిబ్బంది ఫుట్‌పాతుపై ఏర్పాటు చేసిన ఆక్రమణలన్నింటినీ తొలగించారు.

అభివృద్ధికి భూములు కేటాయించండి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మండల అభివృద్ధి కోసం 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గుమ్మడిదల గ్రామ పరిధిలోని సర్వే నంబరు 109లో రైతులకు అసైన్డ్ భూములుగా ఉన్న 150 ఎకరాలను ప్రభుత్వం ఐటీ ఇండస్ట్రీయల్ పార్కు కోసం కేటాయించిందన్నారు. ఈ భూమిలోంచి 50 ఎకరాలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘స్టోన్ క్రషర్ అనుమతులు రద్దు చేయాలి’

జిన్నారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మాధారం గ్రామ పరిధిలో సర్వే నంబరు 210లో ఏర్పాటు చేస్తున్న స్టోన్ క్రషర్ అనుమతులు రద్దు చేయాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, స్టోన్ క్రషర్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం ఈ విషయమై మెదక్ అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మైనింగ్‌శాఖ అధికారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు రమణసింగ్, సాయికుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిని చంపుతానని బెదిరింపు

● బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకుడిని చంపుతామంటూ సామాజిక మాధ్యమాలలో బెదిరింపులకు గురిచేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం శివ్వంపేటలో చోటు చేసుకుంది. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తాను అదే గ్రామానికి చెందిన ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తలు బట్టలూడిపోయేలా చంపుతామని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చేసిన త్రినేష్‌గౌడ్, గోమారం అజయ్, రుస్తుంపేట నవీన్‌లపై కాంగ్రెస్ నాయకుడు వారాల గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సాయిలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఉపసర్పంచ్

గుమ్మడిదల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ జింక గోపాల్‌ముదిరాజ్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్‌కు అత్యంత సమీపంగా ఉండే గోపాల్, పార్టీలో అభివృద్ధి లేకపోవడం, కార్యకర్తలకు ప్రాధాన్యత లేకపోవడం వంటి కారణాలతో అసంతృప్తి చెంది కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జింక గోపాల్ ముదిరాజ్ బీఆర్ఎస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక రాజకీయాల్లో తనకున్న అనుభవాన్ని బీఆర్ఎస్ అభివృద్ధికి వినియోగిస్తానని గోపాల్ తెలిపారు.